

తుపాన్ నేపథ్యంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

ప్రజాశక్తి - భీమవరం

మాండూస్ తుపాన్ నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన చేశారు. మాండూస్ తుపాన్‌ను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో పలు చోట్ల కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా కలెక్టరేట్లో 08816 299189, నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 93911 85874, భీమవరం ఆర్‌డిఒ కార్యాలయంలో 94919 62042 కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటితో పాటు అన్ని మండల కేంద్రాల్లో కూడా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. తుపాను ప్రభావంతో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉన్నందున తుపాన్ తీరం దాటే వరకూ మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కల్లాల్లో ఉంటే బరకాలతో కప్పి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు

గ్రామీణ పేదల సమస్యలే ఎజెండాగా..

చర్చలు.. సమీక్షలు



వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జాతీయ, రాష్ట్ర నేతలు, ప్రముఖులు

- జెండావిష్కరణతో రెండో రోజు వ్యకాస 29వ రాష్ట్రమహాసభ ప్రారంభం
- సంఘం చరిత్రపై పాటూరి రామయ్య రాసిన పుస్తకావిష్కరణ
- గ్రామాల్లో సంఘ బలోపేతంపై దృష్టి పెట్టాలి: విజయరాఘవన్
- సమరశీల పోరాటాలతోనే మార్పు తథ్యమని దిశానిర్దేశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జంగారెడ్డిగూడెం

గ్రామీణ పేదల సమస్యలే ఎజెండా.. వారి బతుకుల్లో తాత్కాలిక, శాశ్వత మార్పునకు చేయాల్సిన ఉద్యమ కార్యాచరణపై చర్చోపచర్చలతో వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ రెండోరోజు శుక్రవారం సాగింది. జంగారెడ్డిగూడెం శివార్లలో దండమూడి రామలక్ష్మి కల్యాణ మండపంలో సంఘ పతాకావిష్కరణతో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. తొలుత సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్ఎ పాటూరి రామయ్య జెండావిష్కరణ చేశారు. అనంతరం పుచ్చలపల్లి సుందరయ్య, మల్లు స్వరాజ్యం, శంకరన్, శ్రీరామ్మూర్తి, అన్నే వెంకటేశ్వరరావు, అనూసయమ్మ తదితర అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ప్రతినిధుల సభ ప్రారంభమైంది. తొలుత ఆహ్వాన సంఘం అధ్యక్షులు షేక్ సాబ్జీ అధ్యక్షోపన్యాసం చేశారు. సభకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు విజయ రాఘవన్ మాట్లాడుతూ 29వ మహాసభలో చర్చించాల్సిన అంశాలు, భవిష్యత్తులో ముందుకు సాగాల్సిన విషయాలపై దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రజలతో అంతా మమేకమై వారి సమస్యలపై పోరాడాలని, ఈ మహాసభలో దానిపైనే ప్రధానంగా చర్చించాలని సూచించారు. ఢిల్లీలో రైతుల పోరాటమే మనందరికీ స్ఫూర్తి అని అన్నారు. పేదల సమస్యలు, వేతనాలపై చర్చించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు తీవ్ర నష్టం కల్గిస్తున్నాయన్నారు. దీంతో కార్మికులు గ్రామాలను వదిలి పట్టణాలకు వలసపోతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామాల్లో నిరుద్యోగం పెరుగుతుందని తెలిపారు. రాజకీయాల్లో ధనప్రభావం పెరిగిపోయిందని, అవినీతి సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ఒక్కో అసెంబ్లీ స్థానంలో ఎన్నికల్లో రూ.200 కోట్లు నుంచి రూ.300 కోట్లు వరకూ ఖర్చు పెడుతున్నారన్నారు. కుల ప్రభావం సైతం పెరిగిపోయిందన్నారు. అనంతరం సీనియర్ నేత పాటూరి రామయ్య రాసిన 'ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమ చరిత్ర' పుస్తకాన్ని విజయరాఘవన్ ఆవిష్కరించారు. అనంతరం ఆహ్వానసంఘం ఉపాధ్యక్షులు దండమూడి ప్రసాద్, మాజీ ఎంఎల్‌ఎసి, బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు జల్లి విల్సన్, ఆహ్వానసంఘం గౌరవాధ్యక్షులు మేకా ఈశ్వరయ్య, మాజీ ఎంఎల్ఎ, సీనియర్ నాయకులు పాటూరి రామయ్య, వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం నాయకులు సోమయ్య మాట్లాడారు. అనంతరం జిల్లాలవారీగా ప్రతినిధుల చర్చలు సాగాయి. సంఘం కేరళ రాష్ట్ర కార్యదర్శి చంద్రన్ తమ రాష్ట్ర అనుభవాలపై ప్రసంగించారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణపై చర్చలు నడిచాయి. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్, రైతుసంఘం పూర్వపు రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, పూర్వ రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం, నేతలు ఎ.రవి, పిల్లి రామకృష్ణ, జీవరత్నం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సంపద సృష్టికర్తలకు అప్పులా

ఆహ్వాన సంఘం అధ్యక్షులు, ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

సమాజంలో 90 శాతం శ్రమజీవులైన వ్యవసాయ కార్మికులకు నేడు అప్పులు, ఆత్మహత్యలు మిగులుతున్నాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. శుక్రవారం ప్రతినిధుల ప్రారంభ సభలో ఆయన అధ్యక్షోపన్యాసం చేస్తూ పశ్చిమగోదావరి జిల్లాకు అనేక రంగాల్లో ఘనమైన చరిత్ర ఉందన్నారు. జిల్లా విభజన అనంతరం ఏలూరు జిల్లాగా అవతరించాక మరింత ప్రాముఖ్యత పెరిగిందన్నారు. అటువంటి జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ నిర్వహించడం అభినందనీయమన్నారు. మారుతున్న కాలంలో వ్యవసాయ కార్మికులకు రోజువారీ పని దినాలు తగ్గిపోయి సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులకు కనీస కూలి కష్టమైపోతుందన్నారు. భూమి తల్లిని నమ్ముకుని సాగులో ప్రధాన పాత్ర పోషించే వ్యవసాయ కూలీలు గౌరవంగా జీవించేందుకు పోరాటాలే మార్గమని అన్నారు.

ఎర్రజెండా ఉండగా కార్పొరేట్ ఆటలు సాగవు

ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ దండమూడి ప్రసాద్

సమాజంలో వ్యవసాయ రంగాన్ని మోస్తున్నది 70 శాతం ప్రజలు, వ్యవసాయ కార్మికులేనని ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ దండమూడి ప్రసాద్ అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ ప్రారంభ సభలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల స్థితిగతులను మార్చేందుకు ప్రత్యేక కార్పొరేషన్ అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశ సంపద కొద్దిమంది చేతుల్లో ఉందన్నారు. శ్రమించే వారందరికీ సంపద దక్కాలన్నారు. సమాజంలో ఎర్రజెండా ఉన్నంతకాలం కార్పొరేట్ల ఆటలు సాగవని ఆయన అన్నారు. వ్యవసాయ కార్మికుల స్థితిగతులను మార్చుకునేందుకు కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఐక్యం కావడం ఎంతో అవసరమన్నారు.

ఐక్య పోరాటాలు చేయాలి

మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్

శ్రమ జీవులైన వ్యవసాయ కార్మికులకు న్యాయమైన కూలి రేట్లు, సామాజిక న్యాయం కోసం వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ దోహదపడుతుందని మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య గ్రామంలో పుట్టిన వ్యవసాయ కార్మిక సంఘం ఇది. ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు ఒకే సమస్య.. ఒకే ఎజెండాపై పోరాటాలు నిర్వహిస్తున్నాయి. భూమి పంచేందుకు, కూలి పెంచేందుకు రానున్న రోజుల్లో ఐక్యఉద్యమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. వ్యవసాయ కార్మికులు, దళితులు, గిరిజనులు పోరాడి సాధించుకున్న భూసంస్కరణ చట్టం, అటవీ హక్కుల చట్టం, కనీస కూలి చట్టాలను పెట్టుబడిదారీ ప్రభుత్వాలు చెత్తబుట్టలో వేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనేరు రంగారావు భూసిఫార్సులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నవరత్నాల్లో భూపంపిణీ ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. వ్యవసాయ కార్మికుల్లో అత్యధికులు దళితులు, గిరిజనులు ఉన్నారని, వారిని ఏకం చేసేందుకు ఐక్య ఉద్యమాలు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

దళితులు, గిరిజనుల నిలువుదోపిడీ

ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు మేకా ఈశ్వరయ్య

నేటికీ దళితులు, గిరిజనులు నిలువు దోపిడీకి గురవుతున్నారని ప్రముఖ న్యాయవాది, మహాసభ ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు మేకా ఈశ్వరయ్య అన్నారు. ప్రతినిధుల ప్రారంభ సభలో ఆయన మాట్లాడుతూ మెట్టప్రాంతంలో గిరిజనుల మాన, ప్రాణాలు దోచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదిగా తన దృష్టికి వచ్చిన అనేక గిరిజన కేసుల్లో చాలామంది తండ్రి ఎవరో తెలియని దుస్థితిలో ఉన్నారన్నారు. గతంలో తాను కమ్యూనిస్టుగా.. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడిగా పని చేసిన సమయంలో తనపై 300కు పైగా కేసులు నమోదు చేశారని, రెండేళ్లపాటు జైలు జీవితం గడిపానని తెలిపారు. ఆ సమయంలో పోలవరం మండలంలో అన్యాయంగా కేసులు మోపబడి జైలుకు వచ్చిన కూలీలు పదిమందిని చైతన్యపరిచి ఆ మండలంలో వ్యవసాయ కార్మిక సంఘం స్థాపనకు బీజం వేశామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో దోపిడీకి గురవుతున్న వర్గాలు అంబేద్కర్ భావజాలంపై ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం తరపున డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పేరిట కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు.



హాజరైన ప్రతినిధులు

భూమి కోసం ఉద్యమం..

వ్యకాస సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ పాటూరి రామయ్య

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వ్యవసాయ కార్మికులు శాశ్వత ఉపాధి కోసం, భూమి కోసం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ పాటూరి రామయ్య అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలో ప్రతినిధుల ప్రారంభ సభ సందర్భంగా సంఘ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలలో అమరవీరులకు నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం వ్యవస్థాపకులు పుచ్చలపల్లి సుందరయ్య, అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు తెలిపారు. అనంతరం ప్రతినిధుల ప్రారంభ సభలో పాటూరి రామయ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టిన ఉద్యమాలు, పోరాటాల డిమాండ్లను బూర్జువా ప్రభుత్వాలు అవసరం మేరకు సంక్షేమ పథకాల పేరుతో నామమాత్రంగా అమలు చేస్తున్నాయన్నారు. బూర్జువా ప్రభుత్వాల పాలనలో సమాజంలో దారిద్ర్య నిర్మూలన, సమానత్వం సాధ్యం కాదన్నారు. వ్యవసాయ కార్మికుల జీవనోపాధి మెరుగుపడాలంటే వారిని చైతన్యపరిచి భూమి సాధించే వరకు పోరాటాలు చేయాలని అన్నారు. తామంతా వ్యవసాయ కూలీల కోసం అప్పట్లో చేసిన ఉద్యమాలకు వారసత్వ ఉద్యమాలు, పోరాటాలు ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

సంఘ ఉద్యమ చరిత్ర పుస్తకావిష్కరణ

వ్యవసాయ కార్మిక సంఘం పూర్వ జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ పాటూరు రామయ్య రచించిన 'వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమ చరిత్ర' పుస్తకాన్ని సంఘం జాతీయ అధ్యక్షులు విజయ రాఘవన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల చేతిలో భూమి లేకుండా వారి జీవితాల్లో మార్పు సాధ్యం కాదన్నారు. భూమి కావాలనే నినాదం తీసుకొచ్చింది ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అన్నారు. వ్యవసాయ కార్మికులు, దళితులు, పేదలు అనేక పోరాటాలు చేస్తే పాలక పార్టీలు ఆ సమస్యలు పరిష్కరించకుండా అమ్ముల పొది నుంచి తీసినట్లు సంక్షేమ పథకాల పేరుతో అమలు చేస్తారని ఎద్దేవా చేశారు. బూర్జువా, భూస్వామ్య, పెట్టుబడిదారీ ప్రభుత్వాలు ఉన్నంతకాలం పేదరికం, దారిద్ర్యం రూపుమాపలేమన్నారు. పేదల బతుకుల్లో సంపూర్ణ మార్పు రావాలంటే అది సోషలిజం ద్వారానే సాధ్యమన్నారు. అందుకు ఉద్యమాలు విస్తరించడమే మార్గమన్నారు.



రామయ్య



సోమయ్య



సుబ్బారావు



విల్సన్



ప్రసాద్



ఈశ్వరయ్య



ఆకివీడులో ధాన్యం ఒబ్బిడి చేస్తున్న రైతులు

భయపెడుతున్న.. మాండూస్

జిల్లాలో పలు చోట్ల వర్షం

రైతన్నల ఆందోళన



సీసలిలో 100 కౌంట్ రొయ్యలు పట్టుబడి చేపడుతున్న రైతులు

ప్రజాశక్తి - ఆచంట

శుక్రవారం సాయంత్రం మండలంలో వాతావరణ ఒక్కసారిగా మేగావృతమై ఈదురుగాలితో కూడిన వర్షం కురిసింది. వర్షానికి వాహనదారులు, పాదచారులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. వర్షానికితోడు ఈదురుగాలులు వీయడంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. తుపాను తీవ్ర రూపం దాల్చే ప్రమాదం పొంచి ఉందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. వాతావరణం మారిపోవడంతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. చేతికందొచ్చిన పంట ఎక్కడ చేయి జారిపోతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ భారీ వర్షం పడితే గింజ కూడా దక్కదని ఆందోళన చెందుతూ ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్నారు. శుక్రవారం ఉదయం నుంచి పంట కోత పనులు నిలిపివేశారు. మండలంలో 60 శాతం మాత్రమే కోతలు పూర్తయినట్లు మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ తెలిపారు. మండలంలో ఆచంట కొడమంచిలి వల్లూరు పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు, కరుగోరుమిల్లి, కందరవల్లి, భీమలాపురం తదితర గ్రామాల్లో ముమ్మరంగా కోతలు జరుగుతున్నాయి. వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెనుమంట్ర : మాండూస్ తుపాన్ నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచి మండలంలో చల్లనిగాలులతో చిరుజల్లులు పడ్డాయి. దీంతో రైతులు తమ ధాన్యాన్ని పొలాల్లో ప్రత్యామ్నాయ పద్ధతుల్లో భద్రపర్చుకుంటున్నారు. ఇప్పటికే 50 శాతం విక్రయాలు పూర్తయ్యాయి. మరో ఏడు రోజుల్లో ధాన్యం అమ్మకాలు పూర్తి చేసుకునే సమయంలో తుపాను రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

పెనుగొండ : తుపాను నేపథ్యంలో శుక్రవారం మండలంలో ఉదయం నుంచి చిన్నపాటి వర్షం పడింది. దీనికితోడు చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాళ్ల: ఆరుగాలం కష్టపడి పండించిన పంట రైతుకు అక్కరకు రాకుండా పోతోంది. డెల్టా ప్రాంతాల్లో అధిక దిగుబడి వచ్చిందని సంబరపడే లోపే ముంచుకొస్తున్న తుపాను రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. జిల్లాలో వేల ఎకరాల్లో వరి పంట ఇంకా చేల్లో ఉంది. వర్షాలు పడితే తమ పరిస్థితి ఏంటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు చల్లగాలి వేయడంతో చెరువుల్లోని చేపలకు ఆక్సిజన్ అందక తిరగబడే ప్రమాదం ఉంది. రొయ్యల చెరువుల్లో అధిక శాతం 100 కౌంట్‌కు చేరడంతో భారీ వర్షం కురిస్తే రూ.లక్షల్లో నష్టం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఏరియేటర్లు నిరంతరం తిరిగేలా జనరేటర్లు, విద్యుత్ మోటార్లను సిద్ధం చేస్తున్నారు. చేసేది లేక 100 కౌంట్ ఉన్న రొయ్యలను పట్టుబడి చేసి అయినకాడికి అమ్ముకుంటున్నారు. వాతావరణ శాఖ తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో గుబులు మొదలైంది. మండలంలో ఒకవైపు వరి కోతలు, నూర్పుళ్లలో రైతులు తలమునకలై ఉన్నారు. ఈ సమయంలో వర్షం పడితే తాము నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

ఆకివీడు : గత రెండు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులతో వరి రైతులు బెంబేలెత్తిపోతున్నారు. మండలంలో సుమారు 4,600 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అధికారులు అంచనా వేశారు. పంట చేతికందే సమయంలో తుపాను రైతులను కలవరపెడుతోంది. వర్షం ఎక్కువగా పడితే కోతకు సిద్ధంగా ఉన్న వరిచేలు తడిసిపోతే తాము నష్టాల ఊబిలో కూరుకుపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 60 శాతం పైబడి కోతలు పూర్తయ్యాయి. ధాన్యపు రాశులు పోగబడి ఉన్నాయి. గట్టుకు చేరిన ధాన్యంలో సగం పైగా ఇప్పటికే మిల్లులకు చేర్చామని, మిగిలిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. గత 48 గంటలుగా వీస్తున్న గాలుల వల్ల పంట నేలకొరిగడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు.

పాలకొల్లు : మాండూస్ తుపాన్ ప్రభావంతో పాలకొల్లు నియోజకవర్గంలో శుక్రవారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీనికితోడు చలిగాలులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షంతో చేతికొచ్చిన ఖరీఫ్ పంట నాశనం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఎగసి పడుతున్న అలలు

సముద్రంలో 'అల'జడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మాండూస్ తుపాను ప్రభావంతో శుక్రవారం పేరుపాలెంలోని సముద్రం పోటెత్తింది. దీంతో సముద్రంలోని కెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. అలల ఉధృతికి భూభాగం పైకి సముద్రపు నీరు వచ్చింది. మండలంలోని గ్రామాల్లో తెల్లవారుజాము నుంచి వర్షం కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

కలెక్టర్‌కు గవర్నర్‌చే సత్కారం

ప్రజాశక్తి - భీమవరం

సాయుధ దళాల పతాక నిధికి అత్యధిక నిధిని సమకూర్చిన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ సత్కరించారు. సాయుధ దళాల పతాక దినోత్సవం నేపథ్యంలో జిల్లా సైనిక సంక్షేమాధికారిగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అత్యధిక నిధిని సమకూర్చడం స్ఫూర్తిదాయకమని గవర్నర్ భిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. విజయవాడ రాజ్ భవన్‌లో శుక్రవారం సాయుధ దళాల పతాక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ మాట్లాడుతూ భారతీయుల ఆలోచనలో సాయుధ దళాలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ సందర్భంగా 2021 సాయుధ దళాల పతాక దినోత్సవం నేపథ్యంలో జిల్లా సైనిక సంక్షేమాధికారులుగా అత్యధిక నిధిని సమకూర్చిన పశ్చిమ కలెక్టర్ పి.ప్రశాంతిను, ఏలూరు జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్‌ను హోంశాఖామంత్రి తానేటి వనిత అభినందించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి.సిసోడియా, హోంశాఖ కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఏలూరు జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ పాల్గొన్నారు.



కలెక్టర్ ప్రశాంతిని సత్కరిస్తున్న రాష్ట్ర గవర్నర్


కార్మికుల తొలగింపును ఉపసంహరించుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - తణుకురూరల్

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల తొలగింపు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ పిఎన్‌డి ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సుమారు 2 లక్షల 50 వేల మంది తక్కువ జీతాలకు పనిచేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలైనా వారిని రెగ్యులర్ చేయలేదు కదా ఇప్పుడు పది సంవత్సరాల్లోపు పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించాలని నిర్ణయం తీసుకోవడం దారుణమని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులు నచ్చిన రీతిలో ప్రకటనలు చేస్తూ ఉద్యోగులను మనోవేదనకు గురిచేస్తున్నారని తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న అలవెన్స్, బకాయి జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యోగులతో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ సహాయ కార్యదర్శి కామన మునిస్వామి, జిల్లా ఉపాధ్యక్షురాలు అడ్డగర్ల అజయకుమారి, గార రంగారావు, పట్టణ అధ్యక్షులు ఎన్.ఆదినారాయణబాబు, కేశవ, వై.మంగ, సోము, పద్మ, ఎన్.నాగరాజు, సుధీర్, బి.పైడమ్మ, టి.దుర్గ పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు



వైద్య సేవలందిస్తున్న 104 సిబ్బంది

ఫ్యామిలీ ఫిజిషియన్‌తో మెరుగైన సేవలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటామని పెనుమంట్ర పిహెచ్‌సి వైద్యులు కె.లావణ్య, వై.అనూష అన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ లో భాగంగా శుక్రవారం పొలమూరు సచివాలయం-1 పరిధిలో 104 ట్రైల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం ద్వారా మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ పరంజ్యోతి, ఎంపిహెచ్‌ఎ ఆర్.వేణుగోపాలస్వామి, ఎంఎల్‌హెచ్ పిబి శ్రీనివాస్, ఎఎన్‌ఎం నాగలక్ష్మి, ఆశా సత్యవతి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని గవరపేట గ్రామ సచివాలయం పరిధిలో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో శుక్రవారం ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఎం.నవ్యజీవన్ మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, శిశువులకు, అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ధనలక్ష్మి, 104 వైద్యాధికారి డాక్టర్ పివి.నారాయణ, ఆరోగ్య విస్తరణ అధికారి కె.ప్రభాకర్, ఎంఎల్‌హెచ్‌పి జివి.ప్రశాంతి, ఎఎన్‌ఎం కనకదుర్గ, ఆశాలు వరలక్ష్మి, ఉషాకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ వైఎస్.మూర్తి పాల్గొన్నారు.

మృత్యుంజయ సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మృత్యుంజయ విశాల సహకార పరపతి సంఘాన్ని మరింత అభివృద్ధి బాటలోకి తీసుకెళ్లి రైతులకు మేలైన సేవలందించాలని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంట మృత్యుంజయ సొసైటీ 2023 నూతన క్యాలెండర్‌ను తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు ఆవిష్కరించి క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీని అన్నివిధాలా అభివృద్ధి పరుస్తూ ముందుకు తీసుకెళ్తున్న కమిటీ సభ్యులకు సిబ్బందికి అభినందనలు తెలిపారు, ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్, సొసైటీ సభ్యులు పెచ్చేటి సత్యనారాయణ, మెండే శ్రీనివాస్, సెక్రటరీ పారుపల్లి ఏసురత్నం, సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమన్వయంతో ప్రణాళిక రూపొందించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

అన్ని శాఖలూ సమన్వయంతో గ్రామాభివద్ధికి ప్రణాళిక రూపొందించాలని ఎంపిడిఒ బి.పూర్ణబాబ్జి అన్నారు. మండల పరిషత్ సచివాలయ సిబ్బంది, యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్, ఎఎన్‌ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అంగన్వాడీలకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్ణ బాబ్జి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎఇ నాగిరెడ్డి, హౌసింగ్ ఎఇ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనులు త్వరగా పూర్తిచేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

నాడు నేడు పనులు నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని మొగల్తూరు, ముత్యాలపల్లి గ్రామాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించారు. నాడు నేడు పనుల్లో సిమెంట్ వృధా కాకుండా చూడాలని సూచించారు. పాఠశాలల మరుగుదొడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం ముత్యాలపల్లిలోని రేషన్ దుకాణాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. మొగల్తూరులోని లక్ష్మీహరిప్రియ రైస్‌మిల్లును తనిఖీ చేశారు. ధాన్యం నిల్వలు, రికార్డుల్లో తేడాలు ఉంటే యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

ప్రజాశక్తి - ఆకివీడు

గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక అమలు తీరు తెన్నులు వంటి పలు అంశాలపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు మండల అభివృద్ధి అధికారి ఎన్.శ్రీకర్ తెలిపారు. మొత్తం మండలంలో ఉన్న గ్రామాలను రెండు భాగాలు చేసి ఈ నెల 12, 13వ తేదీల్లో ఎంపిడిఒ కార్యాలయంలో శిక్షణ ఇస్తామని తెలిపారు.

'జనసేనను అధికారంలోకి తీసుకురావాలి'

ప్రజాశక్తి - కాళ్ల



మాట్లాడుతున్న జనసేన నాయకులు

2024 ఎన్నికల్లో జనసేన పార్టీని అధికారంలోకి తీసుకురావటానికి జన సైనికులు సమిష్టి కృషి చేయాలని ఆ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు పిలుపునిచ్చారు. కాళ్ల మండల అధ్యక్షులు ఏరుబండి రామాంజనేయులు ఆధ్వర్యంలో కోపల్లె, జక్కరం గ్రామాల్లో జనసేన నాయకులతో ఆత్మీయ సమావేశాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జుత్తుగ నాగరాజు మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతానికి జన సైనికులు సమిష్టి కృషి చేయాలన్నారు. ఉండి నియోజకవర్గంలో పార్టీని ముందుకు తీసుకువెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఎల్లప్పుడు ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీర మహిళ లంకా మావుళ్లు, కాళ్ల మండల ఉపాధ్యక్షులు ఓగిరాల రాజేష్, గడి రాము, ప్రధాన కార్యదర్శులు చవ్వాకుల వీరభద్రరావు, ఇర్రింకి జగన్, అరేటి దిలీప్, నిమ్మకాయల సాయికుమార్, కార్యదర్శులు నిమ్మల రాఘవ, ప్రభుదాస్, పార్టీ కాళ్ల గ్రామ అధ్యక్షులు బందారు సోమేశ్వరరావు, యాదాల వెంకటేష్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

యువకునిపై పోక్సో కేసు

ప్రజాశక్తి - వీరవాసరం

బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకునిపై వీరవాసరం పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... వీరవాసరం గ్రామానికి చెందిన ఒక మహిళ తన కుమార్తె కనిపించడంలేదని గత నెల 21 తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నెల ఎనిమిదో తేదీన ఇంటికి చేరిన బాలికను ఇప్పటివరకు ఎక్కడికి వెళ్లావంటూ తల్లి నిలదీయడంతో బాలిక విషయం చెప్పింది. అదే గ్రామానికి చెందిన యువకుడు బాలికను ప్రేమ పేరుతో బస్సు ఎక్కించి నరసాపురం తీసుకెళ్లాడు. అక్కడ నుంచి అదే రోజు వీరవాసరంలో మత్స్యపురి రోడ్డులో ఒక ఎరువుల షాపు వెనకాలకు తీసుకెళ్లి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను రాజమండ్రి తీసుకెళ్లి అక్కడ ఒక ఇంటిని అద్దెకు తీసుకుని బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో బాలిక తల్లిదండ్రులు కేసు పెట్టిన విషయం తెలుసుకున్న యువకుడు ఆ బాలికను ఈ నెల ఎనిమిదో తేదీన వీరవాసరంలో వదిలిపెట్టి వెళ్లిపోయాడు. బాలిక ఇంటికి చేరుకుని విషయమంగా తల్లికి వివరించింది. తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


ముగ్గురిపై చీటింగ్ కేసు

ప్రజాశక్తి - ఉండి

రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బు తీసుకుని మోసగించిన ముగ్గురిపై ఉండి పోలీస్‌స్టేషన్ లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మహాదేవపట్నం గ్రామానికి చెందిన ఆగం ప్రసన్నకుమార్‌కు రైల్వే ఉద్యోగం ఇప్పిస్తామని ఇరగవరం మండలం రేలంగి గ్రామానికి చెందిన పల్లి రాజశేఖర్, పల్లి నాగేశ్వరరావు, మురళి దఫ దఫాలుగా రూ.5,68,430 తీసుకుని మోసగించారు. దీంతో ప్రసన్నకుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నారాయణ రాజు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పాలకోడేరు



మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్‌ను సత్కరిస్తున్న క్రీడా నిర్వాహకులు

కీర్తిశేషులు నారాయణరాజు వాలీబాల్ క్రీడలో ఎంతో మందిని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడంతో పాటు క్రీడా రంగానికి ఆయన అందించిన సేవలు అభినందనీయమని మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను శుక్రవారం విశాఖపట్నం ఎంఎల్ఎ కన్నబాబు, ధర్మాన కృష్ణదాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృష్ణదాస్ మాట్లాడారు. నారాయణరాజు స్వగ్రామంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడ రంగంలో నారాయణరాజు అందించిన సేవలకు అమోఘమన్నారు. దీనికి గుర్తుగా గ్రామంలో క్రీడలు నిర్వహించడం ఈ క్రీడలకు తాను రావడం ఆనందంగా ఉందని తెలిపారు. క్రీడల ముగింపు రోజు మరలా వస్తానని క్రీడాకారులు నారాయణరాజు స్ఫూర్తితో రాణించి అత్యున్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ మంతెన రామరాజు, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు, వాలీబాల్ ప్రముఖులు శ్యామ్‌సుందర్, రమణారావు, ఇంటర్నేషనల్ వాలీబాల్ క్రీడాకారుడు వెంకట రామరెడ్డి, క్రీడల ఆర్గనైజర్ అసిస్టెంట్ కార్యదర్శి పవన్‌కుమార్‌రాజు, రాజకీయ ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హోరా హోరీగా సాగిన పోటీలు..

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ ఛాంపియన్షిప్ పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన పురుషులు, మహిళల జట్ల క్రీడాకారులు తమదైన శైలిలో ఆడారు. అయితే ఒకపక్క వర్షం కురుస్తున్నప్పటికీ క్రీడాకారులు అదేమీ లెక్కచేయకుండా ఆడారు.

యుటిఎఫ్ ఆధ్వర్యాన పది టెస్ట్ పేపర్లు అందజేత

ప్రజాశక్తి - కాళ్ల

పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా టెస్ట్ పేపర్లు అందిస్తున్నామని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య అన్నారు. మాలవానితిప్ప హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ టెస్ట్ పేపర్లు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పట్టాభి రామయ్య మాట్లాడుతూ నిపుణులైన ఉపాధ్యాయులచే వీటిని రూపొందించామన్నారు. ఆరు సబ్జెక్టులకు సంబంధించి సబ్జెక్టుకు 4 మోడల్ పేపర్ల చొప్పున, 24 మోడల్ పేపర్లు ఉంటాయన్నారు. ఈ టెస్ట్ పేపర్లు చదవడం ద్వారా విద్యార్థులు మంచి మార్కులు పొందే అవకాశం ఉందన్నారు. జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ సహృదయంతో పుస్తకాలు అందించిన పట్టాభి రామయ్యను అభినందించారు. విద్యార్థులు రాబోయే పరీక్షలో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కార్యదర్శి బి.కిషోర్, ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు రాంబాబు, వెంకటరత్నం, జితేంద్రనాథ్, పద్మావతి పాల్గొన్నారు.

జర్నలిజంలో కొత్త విషయాలను తెలుసుకోవాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

జర్నలిజంలో రాణించాలంటే ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకోవాలని ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌కెవి ఎస్‌డి మహిళా కళాశాల యుజి, పీజీ (అటానమస్) సెమినార్ హాల్లో కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మినేని మాట్లాడుతూ నేటి తరానికి ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా అవకాశాలున్నాయని, వాటిని అందిపుచ్చుకునే విధంగా విద్యార్థినులు కృషి చేయాలన్నారు. తన నలభై ఏళ్ల జర్నలిజం ప్రస్థానంలో అనేక అటుపోట్లు ఎదుర్కొన్నానన్నారు. అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు పయనిస్తున్న వ్యక్తుల్లో తాను ఒకడినని తెలిపారు. తాను జర్నలిజంలో ఉంటూ అనేక విషయాలు అధ్యయనం చేయడం వల్ల ఇప్పటివరకూ 20 రాజకీయ పుస్తకాలు రాయగలిగానన్నారు. ఇండియన్ జర్నలిస్టు యూనియన్ కార్యవర్గ సభ్యులు డి.సోమసుందర్ మాట్లాడ తూ కొమ్మినేని చేసిన సేవలను కొనియాడారు. కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ మాట్లాడుతూ పెద్దపెద్ద నగరాలు, యూనిర్శిటీల్లో మాత్రమే అందుబాటులో ఉండే జర్నలిజం కోర్సును తమ కళాశాల యాజమాన్యం అందుబాట ులోకి తీసుకొచ్చిందన్నారు. అనంతరం కొమ్మినేనిని కళాశాల యాజమాజ్యం సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ ఎస్.నాగేశ్వరరావు, తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్, జర్నలిజం ఇన్‌ఛార్జి ఎస్‌వి.ప్రసాద్, ఫ్యాకల్టీ గంగాధర్ పాల్గొన్నారు.

పాలకొల్లు : రాష్ట్రంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా సభ్యులు ఎక్కువ కావడంతో ప్రభుత్వానికి నిజమైన జర్నలిస్టుల గుర్తింపు కష్టమవుతోందని రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు చెప్పారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం పాలకొల్లులో మాజీ మంత్రి చేగొండి హరరామ జోగయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులను జర్నలిస్ట్ సంఘాలు ఏకమై ప్రభుత్వానికి లిస్ట్ ఇస్తే వారికి అక్రిడేషన్ ఇవ్వడానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ కార్యదర్శి బాలగంగాధర్ తిలక్, ఐజెయు సభ్యులు ముత్యాల శ్రీనివాస్, పాలకొల్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కెవిఎస్‌ఎల్‌ఎన్.రాజు, కార్యదర్శి లాజరస్, ఎపియుడబ్ల్యూజె జిల్లా ఉపాధ్యక్షులు పిటి.వెంకటేశ్వరరావు, కొణిజేటి గుప్త పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శ్రీరామపురం గ్రామం శివన్నారాయణ పురంలో స్థానిక భవనంలో స్కీమ్ వర్కర్లయిన ఆశాలు, అంగనవాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, పంచాయతీ కార్మికులతో సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 1970లో సిఐటియు ఏర్పడినప్పటి నుంచి కార్మికులు, ఉద్యోగుల ప్రయోజనాలతో పాటు దేశ ప్రజల కోసం పనిచేస్తోందన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రంలో లక్షలమంది కార్మికులు, స్కీమ్ వర్కర్లను సంఘటితపర్చి వేతనాల పెంపుదలకు ఉద్యమిస్తోందన్నారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ భీమవరంలో జనవరి 2, 3, 4 తేదీల్లో జరుగుతుందని, సభలో కార్మికులు, ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి కార్యచరణ రూపొందిస్తారని తెలిపారు. రెండో తేదీన బహిరంగ సభ, ర్యాలీ జరుగుతుందని, ఈ ర్యాలీ, మహాసభలో కార్మికులు, స్కీం వర్కర్లు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుడు గడ్డం కాంతారావు, మండ జ్యోతి, కొండేటి వెంకటలక్ష్మి, బద్ద స్వరాజ్య కుమారి, స్వప్న మార్తమ్మ తోటి శుభకరరావు, కోడి సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమవరం: జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరం లో జరిగే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. శుక్రవారం భీమవరం తాలూకా రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ విస్తృత సమావేశం కలిపిండి సత్యనారాయణ అధ్యక్షతన సిఐటియు కార్యాలయం లో నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, కార్మిక చట్టాలు రద్దు చేయడంతో పాటు నాలుగు లేబర్ కోడ్ల వల్ల కార్మికులకు తీవ్ర నష్టమని కలుగుతుందని విమర్శించారు. జిల్లాలో మొట్టమొదట జరుగుతున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయ ప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కె.సోమేశ్వరరావు పోతురాజు, జి.రామారావు, కృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.

తణుకురూరల్ : రాష్ట్రంలో కనీస వేతనాల బోర్డు వెంటనే ప్రభుత్వం నియమించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. స్థానిక వీరనారాయణ థియేటర్ వద్ద ప్రజలు, వ్యాపారుల నుంచి సిఐటియు రాష్ట్ర మహాసభకు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.దక్షిణామూర్తి, అజయకుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గార రంగారావు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

ఆక్వా (రొయ్యలు, చేపలు) రైతుల సమస్యలు పరిష్కరించి, వారిని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఆక్వారంగం ప్రధాన పాత్ర పోషిస్తోందని తెలిపారు. జిల్లాలో ఆక్వా (రొయ్యలు, చేపలు) ఉత్పత్తుల్లో ప్రథమ స్థానంలో ఉందని పేర్కొన్నారు. ఈ రంగం ద్వారా పన్నుల రూపంలో వేల కోట్ల రూపాయలు, అలాగే విదేశీ మరకద్రవ్యం కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందిస్తోందని తెలిపారు. అయితే కష్టపడి పండించిన రైతులకు మాత్రం కష్టాలు, నష్టాలు మాత్రమే మిగులుతున్నాయని పేర్కొన్నారు. రైతుల గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు వచ్చినప్పుడు వాగ్దానాలు ఇవ్వడమే తప్ప, వాస్తవంగా సహాయం అందించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఒక సమావేశాన్ని జరిపి ఆక్వా రైతులను ఆదుకుంటామని చెప్పిందని తెలిపారు. 100 కౌంట్‌కు ముందుగా రూ.240లకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పి తర్వాత దాన్ని రూ.210లకు తగ్గించిందని తెలిపారు. మార్కెట్లో రూ.200 కూడా రావడం లేదని తెలిపారు. మరోపక్క ఫీడ్ ధరలు విపరీతంగా పెరిగి, రైతులపై భారం పెరిగిందని తెలిపారు. ఫీడ్ ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించి, అదుపులోకి తేవాలని పేర్కొన్నారు. అలాగే లీజు ధరలు కూడా పెరిగిపోయాయని తెలిపారు. ఇటీవల నాణ్యమైన సీడ్ కూడా దొరకడం లేదని వివరించారు. నాణ్యమైన సీడ్ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేపలకు గిట్టుబాటు ధర అందేలా, రైతులు గట్టెక్కేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

గర్భిణులకు ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సిహెచ్‌వి రంగంనాయుడు తెలిపారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భిణు లకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది స్వర్ణ నిరంజని, సత్యనారాయణ, అమ్మాజీ, రాణి, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

వైస్ ఎంపిపి సుబ్బారావు భార్య మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు భార్య గౌరీలక్ష్మి (50) మృతి చెందారు. ఆమె సోదరి కుమార్తె వివాహానికి ఉండి వెళ్లారు. అక్కడ కొంచెం అనారోగ్యంగా అనిపించడంతో కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలిపగా ఆమెను భీమవరంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షిస్తుండగా మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని మొగల్తూరు తీసుకొచ్చారు. సుబ్బారావు కుటుంబసభ్యులకు చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారలు, నాయకులు సానుభూతి తెలిపారు.

పలు వార్డుల్లో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి భీమవరం నియోజకవర్గం ఆధ్వర్యంలో పట్టణంలోని గునుపూడి ఎనిమిదో అసెంబ్లీ క్లస్టర్ ఇన్‌ఛార్జి ఏసుపాదం అధ్యక్షతన 16, 17 వార్డుల్లో శుక్రవారం ఇదేంఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధిక పన్నులతో సామాన్య ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధిని జగన్ గాలికి వదిలేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి పాల్గొన్నారు.

పలుచోట్ల 'గడపగడపకూ మన ప్రభుత్వం'

భీమవరం : ఉండి నియోజకవర్గంలో వైసిపి ప్రభుత్వం అభివృద్ధికి బాటలు వేసి ముందుకు సాగుతుంటే స్థానికంగా ఉన్న ఎంఎల్ఎ మూడున్నర ఏళ్లలో ఏమి చేయలేదని కనీసం ఒక్క రోడ్డు కూడా నిర్మించలేదని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు విమర్శించారు. మండలంలోని పెన్నాడలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ వైసిపి ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆయన కోరారు. డ్రెయినేజీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు, సర్పంచి చిల్లా అనూష, సత్యనారాయణ, ఉప ఎంపిపిలు లక్ష్మీతులసి, నరేష్, గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మండలంలోని దెయ్యాల తిప్ప గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అనంతరం దెయ్యాలతిప్ప గ్రామపంచాయతీ పరిధిలోని వినాయకపురం గ్రామంలో ఇటీవల ప్రమాదానికి గురై ఇంటి వద్దనే చికిత్స పొందుతున్న మోకా సత్తిబాబు, లక్ష్మయ్యలను ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయనరసింహరాజు, జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామచంద్ర ప్రభు,తహశీల్దార్ వై.రవికుమార్ పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - ఉండి

ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు అభివృద్ధి పనులను కమిటీ సభ్యులు ఆమోదించినట్లు పిహెచ్‌సి ఛైర్మన్, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణ రాజు తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు ఉండి సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, కలిసిపూడి సర్పంచి కేశబోయిన జానకి, ఉండి ఎంపిడిఒ ఆడబాల వెంకట అప్పారావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పి.ధర్మతేజ, డాక్టర్ బి.సాయిచంద్ర, సిహెచ్‌ఒ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి

భీమవరం రూరల్ : లబ్ధిదారులు త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తిచేసేలా హౌసింగ్ అధికారులు వారికి అవగాహన కల్పించాలని ఎంఎల్ఎ గ్రంధిశ్రీనివాస్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో హౌసింగ్ పీడీ రామరాజు, డిఇ వెంకటరమణలతో గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవాలన్నారు. గృహాలు నిర్మించుకుంటున్న వారికి బిల్లులను జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు మంజూరు చేయాలని ఆదేశించారు. అనంతరం విస్సాకోడేరు లే అవుట్‌లో ఎంతమంది లబ్ధిదారులు గృహాలు నిర్మించుకుంటున్నారనే దానిపై ఆరా తీశారు.

ఘనంగా మాజీ మంత్రి పితాని పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - పోడూరు

మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ పుట్టినరోడు వేడుకలు టిడిపి నేతలు కొమ్ము చిక్కాలలోని పితాని గృహం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఉండి, పాలకొల్లు ఎంఎల్ఎలు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు పొత్తూరి రామరాజు, వలవల బాబ్జీ, అరిమిల్లి రాధాకృష్ణ పలువురు శుభాకాంక్షల తెలిపారు. పాలకొల్లు అన్నా క్యాంటీన్ వద్ద వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జెసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని పూలపల్లి, ఆగర్రు రైతు బరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా జాయింటు కలెక్టర్ జెవి మురళి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోనే నగదు జమ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మిల్లులకు ధాన్యం తరలించడానికి వాహనాలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ధాన్యం రవాణా ప్రభుత్వం చేపడితే ఏజెన్సీకి రవాణా ఖర్చులు చెల్లించడం జరుగుతుందని, అలాగే రైతు స్వయంగా రవాణా, గోనె సంచులు, హమాలీలను ఏర్పాటు చేసుకుంటే ధాన్యం డబ్బుతో పాటు సదరు ఖర్చులు కూడా రైతుల ఖాతాలలో నేరుగా జమచేస్తామని తెలిపారు. గోనె సంచులు ఆర్‌బికెల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం జెసి విజయలక్ష్మి, పూలపల్లి నరసింహ రైస్ మిల్లులను తనిఖీ చేశారు. ధాన్యం సేకరణకు సంబంధించి వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని మిల్లర్లను ఆదేశించారు. ధాన్యం నిల్వలు, ట్రక్ షీట్లు, రికార్డులను పరిశీలించారు. తరచూ తనిఖీలు నిర్వహిస్తానని, రికార్డుల్లో తేడాలుండి, అవకతవకలకు పాల్పడ నట్లు రుజువైతే వెంటనే సంబంధిత రైస్ మిల్లులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహశీల్దార్ జి.మమ్మీ, రెవెన్యూ, వ్యవసాయ, రైతు భరోసా కేంద్రాలు సిబ్బంది పాల్గొన్నారు.

11న జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈనెల 11వ తేదీ ఆదివారం జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు చినఅమిరం విశ్వకవి రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకూ జరగనున్నట్లు చెకుముకి సైన్స్ జిల్లా కన్వీనర్ సిహెచ్ ప్రసాద్ రావు శుక్రవారం తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి, సైన్స్ పట్ల ఆసక్తి పెంచడానికి జన విజ్ఞాన వేదిక 33 సంవత్సరాలుగా ప్రతిష్టాత్మకంగా చెకుముకి సైన్స్ సంబరాలు పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గలవారు మండల, పట్టణ స్థాయి విజేతలను టీంగా సంబరాలకు పంపించాలని కోరారు.

'ఎన్నికల్లో పితాని విజయం సాధించాలి'

ప్రజాశక్తి - పెనుమంట్ర

రానున్న ఎన్నికల్లో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఘన విజయం సాధించి మరోసారి మంత్రి కావాలని తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు వెలగల బులిరామిరెడ్డి అన్నారు. శుక్రవారం పితాని సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా పెనుమంట్ర ప్రాథమిక ఆసుపత్రిలో గర్భిణులు, సిబ్బందికి డాక్టర్లు అనూష, లావణ్య ఆధ్వర్యంలో బ్రెడ్, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా బులిరామిరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మరోసారి టిడిపి గెలుపు ఖాయమన్నారు. నియోజకవర్గంలో పితాని సత్యనారాయణ ఎంఎల్ఎగా గెలిచి మంత్రి కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో గరువు టిడిపి గ్రామ అధ్యక్షుడు సత్తి ఆనందరెడ్డి, నత్తా రామేశ్వరం ఎంపిటిసి టిఎన్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.